"మధురమైన పిల్లలూ - మీ రాయల్ నడవడికతో సేవ చేయాలి, శ్రీమతాన్ని అనుసరిస్తూ బుద్ధిని రిఫైన్డ్ గా చేసుకోవాలి, మాతలపై గౌరవాన్ని ఉంచాలి"

ప్రశ్న:- ఏ కర్తవ్యము ఒక్క తండ్రిదే తప్ప ఏ మానవమాత్రులది కాదు?

జవాబు:- మొత్తం విశ్వములో శాంతిని స్థాపన చేయడము, ఇది ఒక్క తండ్రి కర్తవ్యమే. మనుష్యులు ఎన్ని కాన్ఫరెన్సులు మొదలైనవి చేస్తున్నా సరే శాంతి స్థాపన జరుగదు. శాంతిసాగరుడైన తండ్రి ఎప్పుడైతే పిల్లలతో పవిత్రతా ప్రతిజ్ఞను చేయిస్తారో, అప్పుడే శాంతి స్థాపన జరుగుతుంది. పవిత్ర ప్రపంచములోనే శాంతి ఉంటుంది. పిల్లలైన మీరు ఈ విషయాన్ని అందరికీ చాలా యుక్తిగా మరియు గొప్పగా అర్థం చేయించండి, అప్పుడు తండ్రి పేరు ప్రఖ్యాతమవుతుంది.

పాట:- నేను ఒక చిన బాలుడిని... (మై ఏక్ నన్హా సా బచ్చా హూ...)

ఓం శాంతి. ఈ పాట భక్తి మార్గములో గానం చేయబడినది ఎందుకంటే ఒక వైపు భక్తి ప్రభావము ఉంది, ఇంకొక వైపు ఇప్పుడు జ్ఞాన ప్రభావము ఉంది. భక్తికి మరియు జ్ఞానానికి రాత్రికి-పగలుకు ఉన్నంత తేడా ఉంది. ఏ తేడా? ఇది చాలా సహజము. భక్తి రాత్రి, జ్ఞానము పగలు. భక్తిలో దుఃఖము ఉంది, భక్తులు దుఃఖితులుగా అయినప్పుడు భగవంతుడిని పిలుస్తారు. అప్పుడు దుఃఖితుల దుఃఖాన్ని దూరం చేయడానికి భగవంతుడు రావలసి ఉంటుంది. అందుకే తండ్రిని అడగడం జరుగుతుంది - డ్రామాలో పొరపాటు ఏమైనా ఉందా? తండ్రి అంటారు - అవును, పెద్ద పొరపాటు ఉంది, అదేమిటంటే మీరు నన్ను మర్చిపోతారు. మరపింపజేసేది ఎవరు? మాయా రావణుడు. తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు - పిల్లలూ, ఈ ఆట తయారుచేయబడి ఉంది. స్వర్గము మరియు నరకము భారత్ లోనే ఉంటాయి. భారత్ లోనే - ఎవరైనా మరణిస్తే వైకుంఠవాసులయ్యారు అని అంటారు. స్వర్గము లేక వైకుంఠము ఎప్పుడు ఉంటుంది అనేది తెలియదు. స్వర్గము ఉన్నప్పుడు మనుష్యులు పునర్జన్మలను తప్పకుండా స్వర్గములోనే తీసుకుంటారు. ఇప్పుడు ఇది నరకము కావున స్వర్గస్థాపన జరిగేంతవరకు పునర్జన్మలను కూడా తప్పకుండా నరకములోనే తీసుకుంటారు. మనుష్యులకు ఈ విషయాల గురించి తెలియదు. ఒకటేమో ఈశ్వరీయ లేక రామ సాంప్రదాయము, ఇంకొకటి రావణ సాంప్రదాయము. సత్య, త్రేతా యుగాలలో రామ సాంప్రదాయము ఉంటుంది, వారికి ఎటువంటి దుఃఖము ఉండదు, అశోక వాటికలో ఉంటారు. మళ్ళీ అర్ధకల్పం తర్వాత రావణ రాజ్యము ప్రారంభమవుతుంది. ఇప్పుడు తండ్రి మళ్ళీ ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేస్తారు. అది అన్నింటికన్నా సర్వోత్తమ ధర్మము. అన్నీ ధర్మాలే కదా! ధర్మాల కాన్ఫరెన్స్ జరుగుతుంది, ఆ సమయములో భారత్ కు అనేక ధర్మాలవారు వస్తారు, కాన్ఫరెన్స్ చేస్తారు. ఇప్పుడు ధర్మాన్నే విశ్వసించని భారతవాసులు కాన్ఫరెన్సు ఏం చేస్తారు? వాస్తవానికి భారత్ యొక్క ప్రాచీన ధర్మము ఆది సనాతన దేవీ-దేవతా ధర్మము. హిందూ ధర్మమైతే లేదు. అన్నింటికన్నా ఉన్నతమైనది దేవీ-దేవతా ధర్మము. అన్నింటికన్నా ఉన్నతోన్నతమైన ధర్మం వారిని ఉన్నతమైన సింహాసనంపై కూర్చోబెట్టాలని నియమం చెప్తుంది. అందరికన్నా ముందు ఎవరిని కూర్చోబెట్టాలి? ఈ విషయంపై కూడా అప్పుడప్పుడూ వారికి గొడవ జరుగుతుంది. ఏ విధంగా ఒకసారి కుంభమేళాలో గొడవ జరిగింది. మొదట మా ఊరేగింపు వెళ్ళాలి అని ఒకరంటే, కాదు మాది వెళ్ళాలి అని ఇంకొకరు అంటూ కొట్లాడుకున్నారు. కావున ఇప్పుడు ఈ కాన్ఫరెన్సులో ఉన్నతోన్నతమైన ధర్మము ఏది అన్నది పిల్లలు అర్థం చేయించాలి. ఇది వారికైతే తెలియదు. తండ్రి అంటారు - ఆది సనాతనమైనది దేవీ-దేవతా ధర్మము. అది ఇప్పుడు కనుమరుగైంది మరియు అందరూ తమను తాము హిందూ ధర్మం వారిగా పిలుచుకోవడం మొదలుపెట్టారు. ఇప్పుడు చైనాలో ఉండేవారు తమ ధర్మాన్ని చైనా ధర్మం అనైతే అనరు. వారు ఎవరినైతే ప్రసిద్ధులుగా గమనిస్తారో వారిని ముఖ్యులుగా చేసి కూర్చోబెడతారు. నియమానుసారంగా కాన్ఫరెన్సులకైతే చాలామంది రాలేరు. కేవలం వివిధ ధర్మాలలోని పెద్దవారికి మాత్రమే ఆహ్వానమును ఇవ్వడం జరుగుతుంది. ఎక్కువమంది ఉంటే మాటలు కూడా ఎక్కువైపోతాయి. ఇప్పుడు వారికి సలహా ఇచ్చేవారైతే ఎవరూ లేరు. మీరు ఉన్నతోన్నతమైన దేవీ-దేవతా ధర్మానికి చెందినవారు. ఇప్పుడు దేవతా ధర్మ స్థాపనను చేస్తున్నారు. భారత్ యొక్క ముఖ్య ధర్మమేదైతే ఉందో, ఏదైతే అన్ని ధర్మాలకూ మాత-పిత వంటిదో, ఆ ధర్మము యొక్క పెద్దను ఈ కాన్ఫరెన్సులో ముఖ్యులుగా చేయాలి అని మీరే చెప్పగలరు. గద్దెపై వారిని కూర్చోబెట్టాలి. మిగిలినవారందరూ వారికన్నా కిందే ఉన్నారు. కావున ముఖ్యమైన పిల్లలు

ఎవరైతే ఉన్నారో వారి బుద్ధి నడుస్తూ ఉండాలి.

భగవంతుడు కూర్చొని అర్జునుడికి అర్థం చేయిస్తారు. ఇతను సంజయుడు, అర్జునుడు రథములో కూర్చున్నవారు. ఆ రథాన్ని నడిపించే సారథి తండ్రి. వారు రూపాన్ని మార్చుకుని శ్రీకృష్ణుని తనువులోకి వచ్చి జ్ఞానాన్ని ఇచ్చారని వాళ్ళు అనుకుంటారు. కానీ వాస్తవానికి అలా కాదు. ఇప్పుడు మీరు ప్రజాపిత కూడా. త్రిమూర్తి చిత్రం ద్వారా చాలా బాగా అర్థం చేయించవచ్చు. త్రిమూర్తులపైన శివబాబా చిత్రము తప్పకుండా ఉండాలి. వారు సూక్ష్మవతనపు రచన. ఈ విష్ణువు పాలన కర్త అని, ప్రజాపిత బ్రహ్మ స్థాపన కర్త అని పిల్లలు అర్థం చేసుకున్నారు కావున వారి చిత్రాలు కూడా కావాలి. ఇది బాగా అర్థం చేసుకోవలసిన విషయము. ప్రజాపిత బ్రహ్మ తప్పకుండా ఉన్నారని బుద్ధిలో ఉంటుంది. విష్ణువు కూడా కావాలి. ఎవరి ద్వారానైతే స్థాపన చేయిస్తారో వారి ద్వారానే పాలన కూడా చేయిస్తారు. స్థాపన బ్రహ్మ ద్వారా చేయిస్తారు. బ్రహ్మతోపాటు సరస్వతి మొదలైన పిల్లలు ఎందరో ఉన్నారు. వాస్తవానికి వారు కూడా పతితుల నుండి పావనులుగా అవుతున్నారు. కావున కాన్ఫరెన్సులో ఆది సనాతన దేవీ-దేవతా ధర్మానికి ముఖ్యురాలిగా జగదాంబ ఉండాలి ఎందుకంటే మాతలకు ఎంతో గౌరవము ఉంది. జగదాంబకు చాలా భారీ మేళా జరుగుతుంది. వారు జగత్పితకు కూతురు. ఇప్పుడు ఆది సనాతన దేవీ-దేవతా ధర్మ స్థాపన జరుగుతోంది. గీతా అధ్యాయము పునరావృతమవుతోంది. ఆ మహాభారత యుద్ధమే ఇప్పుడు ఎదురుగా నిలబడి ఉంది. నేను కల్పకల్పము కల్పము యొక్క సంగమయుగములో భ్రష్టాచారీ ప్రపంచాన్ని శ్రేష్ఠాచారిగా తయారుచేయడానికి వస్తాను. జగదాంబ జ్ఞానదేవిగా మహిమ చేయబడ్డారు. వారితోపాటు జ్ఞానగంగలు కూడా ఉన్నారు. వారికి ఈ జ్ఞానం ఎక్కడి నుండి లభించింది అని వాళ్ళను అడగవచ్చు. జ్ఞానసంపన్నుడైన గాడ్ ఫాదర్ అయితే ఒక్కరే, వారు జ్ఞానాన్ని ఎలా ఇస్తారు? తప్పకుండా వారు శరీరాన్ని తీసుకోవలసి ఉంటుంది. కావున బ్రహ్మ ముఖ కమలం ద్వారా వినిపిస్తారు. ఈ మాతలు కూర్చొని అర్థం చేయిస్తారు. కాన్ఫరెన్సులో వారికి పెద్ద ధర్మమేది అన్నది తెలియాలి కదా. మేము ఆది సనాతన దేవీ-దేవతా ధర్మానికి చెందినవారము అని ఎవ్వరూ భావించరు. ఈ ధర్మము ఎప్పుడైతే కనుమరుగవుతుందో, అప్పుడు నేను వచ్చి స్థాపన చేస్తాను అని తండ్రి అంటారు. ఇప్పుడు దేవతా ధర్మము లేదు. మిగిలిన మూడు ధర్మాల వృద్ధి జరుగుతూ ఉంది. కావున తప్పకుండా దేవీ-దేవతా ధర్మాన్ని మళ్ళీ స్థాపన చేయవలసి ఉంటుంది. ఆ తర్వాత ఇక ఈ ధర్మాలేవీ ఉండనే ఉండవు. తండ్రి ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేసేందుకే వస్తారు. శాంతి ఎలా స్థాపించబడగలదు అనేది కుమార్తెలైన మీరే చెప్పగలరు. శాంతిసాగరుడు ఒక్క పరమపిత పరమాత్మయే. కావున శాంతిని తప్పకుండా వారే స్థాపన చేస్తారు. జ్ఞానసాగరుడు, సుఖసాగరుడు వారే. పతిత-పావనా రండి, వచ్చి భారత్ ను పావనమైన రామరాజ్యంగా తయారుచేయండి అని గానం చేస్తారు కూడా. శాంతిమయంగానైతే వారే తయారుచేస్తారు. ఇది తండ్రి కర్తవ్యమే. మీరు వారి మతంపై నడవడం ద్వారా శ్రేష్ఠ పదవిని పొందుతారు. తండ్రి అంటారు, ఎవరైతే నావారిగా అవుతారో, రాజయోగాన్ని నేర్చుకుంటారో మరియు బాబా, మేము పవిత్రంగా అయి 21 జన్మల వారసత్వాన్ని తీసుకుంటాము అని పవిత్రతా ప్రతిజ్ఞను చేస్తారో, వారే యజమానులుగా అవుతారు, పతితుల నుండి పావనులుగా అవుతారు. లక్ష్మీ-నారాయణులే పావనమైనవారు, అందరికన్నా ఉన్నతమైనవారు. ఇప్పుడు మళ్ళీ పావన ప్రపంచ స్థాపన జరుగుతోంది. మీరు శాంతి కొరకు కాన్ఫరెన్సులు చేస్తున్నారు కానీ మనుష్యులేమైనా శాంతిని స్థాపన చేస్తారా. ఇది శాంతిసాగరుడైన తండ్రి కర్తవ్యము. కాన్ఫరెన్సులకు గొప్ప వ్యక్తులు వస్తారు. చాలామంది సభ్యులుగా అయితే వారికి సలహా కూడా ఇవ్వవలసి ఉంటుంది. తండ్రి కొడుకును ప్రత్యక్షం చేస్తారు. శివబాబా మనుమలు, బ్రహ్మ పిల్లలు జ్ఞానదేవీలు. వారికి భగవంతుడు జ్ఞానాన్ని ఇచ్చారు. మనుష్యులైతే శాస్త్రాల జ్ఞానాన్ని చదువుతారు. ఇలా గొప్పగా అర్థం చేయించినట్లయితే ఎంతో ఆనందం కలుగుతుంది. యుక్తిని తప్పకుండా రచించవలసి ఉంటుంది. ఒకవైపు వారి కాన్ఫరెన్స్ జరగాలి, ఇంకొకవైపు ఎంతో వైభవంగా మీ కాన్ఫరెన్స్ కూడా జరగాలి. చిత్రాలు కూడా క్లియర్ గా ఉన్నాయి, వాటి ద్వారా వెంటనే అర్థం చేసుకుంటారు. వారి కర్తవ్యము వేరు, వీరిది వేరు. అందరూ ఒక్కటే అన్నట్లు ఉండదు కదా. అన్ని ధర్మాల పాత్ర వేరువేరుగా ఉంటుంది. శాంతి కొరకు కలిసి పని చేస్తారు. రిలీజియన్ ఈస్ మైట్ (ధర్మము అనేది శక్తి) అని అంటారు. కానీ అందరికన్నా శక్తివంతమైనవారు ఎవరు? వారే వచ్చి మొదటి నెంబరైన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేస్తారు. ఇది పిల్లలైన మీకే తెలుసు. రోజురోజుకు పిల్లలైన మీకు పాయింట్లు లభిస్తూ ఉంటాయి. అర్థం చేయించే శక్తి కూడా ఉంది. యోగీకి శక్తి బాగుంటుంది. బాబా అంటారు - జ్ఞానీ ఆత్మలే నాకు ప్రియమైనవారు. అలాగని యోగీలు ప్రియమైనవారు కాదని కాదు, ఎవరైతే జ్ఞానీలుగా ఉంటారో వారు యోగీలుగా కూడా తప్పకుండా ఉంటారు. యోగాన్ని పరమపిత పరమాత్మతో జోడిస్తారు. యోగము లేకుండా ధారణ జరగదు. ఎవరికైతే యోగము లేదో, వారికి ధారణ కూడా ఉండదు ఎందుకంటే దేహాభిమానం ఎంతగానో ఉంటుంది. అసురీ బుద్ధిని దైవీ బుద్ధిగా తయరుచేయాలి అని తండ్రి అర్థం చేయిస్తారు. రాతిబుద్ధిని పారసబుద్ధిగా తయారుచేసేవారు తండ్రి అయిన ఈశ్వరుడే. రావణుడు వచ్చి రాతిబుద్ధి

కలవారిగా చేస్తాడు. వారి పేరే అసురీ సాంప్రదాయము. దేవతల ముందుకు వెళ్ళి - మాలో ఏ గుణాలు లేవు, మేము కాములము, కపటులము అని అంటారు. మాతలైన మీరు బాగా అర్థం చేయించవచ్చు. మురళిని వినిపించేందుకు అంతటి ధైర్యము, ఉత్సాహము కావాలి. పెద్ద-పెద్ద సభలలో ఇటువంటి విషయాలను వినిపించవలసి ఉంటుంది. మమ్మా జ్ఞానదేవి. బ్రహ్మను ఎప్పుడూ జ్ఞానదేవుడు అని అనరు. సరస్వతి పేరే గాయనము చేయబడింది. ఎవరికి ఏ పేరు ఉంటుందో ఆ పేరునే పెడతారు. మాతల పేరును ప్రఖ్యాతం చేయాలి. కొంతమంది గోపులకు ఎంతో దేహాభిమానం ఉంది. బ్రహ్మాకుమారులమైన మేము జ్ఞానదేవులము కాదా? అని అనుకుంటారు. అరే, స్వయంగా బ్రహ్మయే తమను తాము జ్ఞానదేవునిగా పిలుచుకోవడం లేదు. మాతలపై ఎంతో గౌరవాన్ని ఉంచవలసి ఉంటుంది. ఈ మాతలే జీవితాలను మార్చేవారు, మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేసేవారు. మాతలు కూడా ఉన్నారు, కన్యలు కూడా ఉన్నారు. ఆదర్ కుమారీ యొక్క రహస్యాన్ని ఎవరూ అర్థం చేసుకోరు. వివాహం చేసుకున్నవారైనా సరే వారూ బ్రహ్మాకుమారీలే. ఇవి చాలా అద్భుతమైన విషయాలు. ఎవరైతే తండ్రి నుండి వారసత్వం తీసుకోవలసి ఉంటుందో వారు అర్థం చేసుకుంటారు. ఇకపోతే ఎవరి భాగ్యంలోనైతే లేదో వారేమి అర్థం చేసుకుంటారు, పదవులు తప్పకుండా నంబరువారుగా ఉన్నాయి. అక్కడ కూడా కొందరు దాస-దాసీలుగా ఉంటారు, కొందరు ప్రజలుగా ఉంటారు. ప్రజలు కూడా కావాలి. మనుష్య సృష్టి వృద్ధి చెందుతూ ఉంటే ప్రజలు కూడా వృద్ధి చెందుతూ ఉంటారు. కావున ఇటువంటి కాన్ఫరెన్సులు ఏవైతే జరుగుతాయో, వాటి కోసం ఎవరైతే స్వయాన్ని ముఖ్యులుగా భావిస్తారో వారు సిద్ధముగా ఉండాలి. ఎవరిలోనైతే జ్ఞానము లేదో, వారు చిన్నవారు అయినట్లు. వారికి అంత బుద్ధి ఉండదు. చూడడానికి పెద్దగా ఉన్నా కానీ వారిలో బుద్ధి పెద్దగా లేదు, వారు చిన్నవారే. కొందరి బుద్ధి చాలా బాగుంటుంది. మొత్తం ఆధారమంతా బుద్ధిపైనే ఉంది. చిన్న-చిన్నవారు కూడా చురుకుగా ముందుకు వెళ్ళిపోతారు. కొందరు అర్థం చేయించే విధానములో చాలా మధురత ఉంటుంది. మాట్లాడటం చాలా రాయల్ గా మాట్లాడుతారు. వీరు రిఫైన్ పిల్లలు అని భావించడం జరుగుతుంది. నడవడిక ద్వారా కూడా షో జరుగుతుంది కదా. పిల్లల నడవడిక చాలా రాయల్ గా ఉండాలి. రాయల్ గా ఉండనటువంటి పని ఏదీ చేయకూడదు. పేరును అప్రతిష్ఠపాలు చేసేవారు ఉన్నత పదవిని పొందలేరు. శివబాబా పేరును అప్రతిష్ఠపాలు చేస్తే అర్థం చేయించే హక్కు తండ్రికి కూడా ఉంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

రాత్రి క్లాస్

జీవాత్మలమైన మేము పరమపిత పరమాత్మని సమ్ముఖములో కూర్చున్నాము అని ఇప్పుడు పిల్లలైన మీరు భావిస్తారు. దీనినే మంగళ మిలనము అని అంటారు. 'మంగళం భగవాన్ విష్ణువు' అని అంటూ ఉంటారు కదా. ఇప్పుడు ఈ మిలనము మంగళమయమైనది కదా. భగవంతుడు విష్ణు కులము యొక్క వారసత్వాన్ని ఇస్తారు, అందుకే వారిని 'మంగళం భగవాన్ విష్ణు' అని అంటారు. ఎప్పుడైతే తండ్రి జీవాత్మలను కలుసుకుంటారో, ఆ మిలనము చాలా సుందరమైనది. ఇప్పుడు మేము ఈశ్వరుడి నుండి మా వారసత్వాన్ని తీసుకునేందుకు ఈశ్వరీయ పిల్లలుగా అయ్యాము అని మీరు కూడా భావిస్తారు. ఈశ్వరుని వారసత్వం తర్వాత దైవీ వారసత్వం లభిస్తుందని పిల్లలకు తెలుసు అనగా స్వర్గములో పునర్జన్మ లభిస్తుంది. కావున పిల్లలైన మీకు సంతోషమనే పాదరసం పైకెక్కి ఉండాలి. మీ వంటి అదృష్టవంతులు లేక సౌభాగ్యశాలురు ఇంకెవ్వరూ లేరు. ప్రపంచములో బ్రాహ్మణ కులము వారు తప్ప ఇంకెవ్వరూ భాగ్యశాలురుగా కాలేరు. విష్ణు కులము రెండవ నెంబర్ అవుతుంది. అది దైవీ ఒడి అవుతుంది. ఇప్పుడు ఇది ఈశ్వరీయ ఒడి, ఇదే ఉన్నతమైనది కదా. దిల్వాడా మందిరము ఈశ్వరీయ ఒడిలోని మందిరము. అంబ మందిరము కూడా ఉంది. ఆ మందిరము సంగమయుగాన్ని అంతగా సాక్షాత్కారం చేయించదు. ఈ దిల్వాడా మందిరము సంగమయుగాన్ని సాక్షాత్కారం చేయిస్తుంది. పిల్లలు ఎంతైతే అర్థం చేసుకున్నారో అంతగా ఇంకే మనుష్యమాత్రులు అర్థం చేసుకోలేరు. ఎంతగా బ్రాహ్మణులైన మీరు అర్థం చేసుకున్నారో అంతగా దేవతలు కూడా అర్థం చేసుకోరు. మీరు సంగమయుగ బ్రాహ్మణులు. వారు సంగమయుగ బ్రాహ్మణులను మహిమ చేస్తారు. బ్రాహ్మణులే దేవతలుగా అవుతారు, అటువంటి బ్రాహ్మణులకు నమస్కారము అని అంటారు. బ్రాహ్మణులే నరకాన్ని స్వర్గముగా తయారుచేసే సేవను చేస్తారు. ఇటువంటి పిల్లలకు (బ్రాహ్మణులకు) నమస్తే. అచ్ఛా! గుడ్ నైట్.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రికి ప్రియమైనవారిగా అయ్యేందుకు జ్ఞానీలుగా, యోగీలుగా అవ్వాలి. దేహాభిమానంలోకి రాకూడదు.

2. మురళిని వినిపించే ధైర్యమును, ఉత్సాహమును ఉంచాలి. మీ నడవడికతో తండ్రిని ప్రఖ్యాతము చేయాలి, చాలా మధురంగా మాట్లాడాలి.

వరదానము:- కర్మభోగమును కర్మయోగములోకి పరివర్తన చేసి సేవకు నిమిత్తులుగా అయ్యే భాగ్యవాన్ భవ

తనువు యొక్క లెక్కాచారము ఎప్పుడూ ప్రాప్తి లేక పురుషార్థపు మార్గములో విఘ్నముగా అనుభవమవ్వకూడదు. తనువు ఎప్పుడూ సేవ నుండి వంచితము చెయ్యకూడదు. భాగ్యవాన్ ఆత్మ కర్మభోగ సమయములో కూడా ఏదో ఒక విధంగా సేవకు నిమిత్తముగా అవుతారు. కర్మభోగము చిన్నదైనా లేక పెద్దదైనా కానీ, దాని కథను విస్తారము చెయ్యకండి, దానిని వర్ణన చెయ్యటము అనగా సమయాన్ని మరియు శక్తిని వ్యర్థముగా పోగొట్టుకోవడము. యోగీ జీవితము అనగా కర్మభోగాన్ని కర్మయోగములోకి పరివర్తన చెయ్యటము - ఇదే భాగ్యవంతుల గుర్తు.

స్లోగన్:- దృష్టిలో దయ మరియు శుభ భావన ఉన్నట్లయితే అభిమానము మరియు అవమానము యొక్క దృష్టి సమాప్తమైపోతుంది.